ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
మంగళవారం 24 సెప్టెంబరు 2024

రామప్ప భద్రత.. గాలిలో దీపమేనా?



- 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే
- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల ఆక్షేపణలు

7



రక్షణ చర్యలకు నోచుకోని రామప్ప దేవాలయం ఆవరణలోని ఉప ఆలయం గొల్లాలగుడి



అది ప్రపంచ వారసత్వ సంపదగా.. యునెస్కో గుర్తింపు పొందిన.. ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయమైన రామప్ప దేవాలయం. ఇక్కడ ప్రధాన ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలున్నాయి. ఈ అద్భుత కట్టడాలను తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. రక్షణ మాత్రం కరువైంది. ఇందుకు ఇటీవల రామప్ప అనుబంధ ఆలయమైన గొల్లాలగుడి వద్ద గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఏకంగా వెయ్యి కిలోల బరువున్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కిందికి తోశారు. దీంతో రామలింగేశ్వరుడి రక్షణపై అనుమానాలు పెరుగుతున్నాయి. అయితే రామప్ప పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

- వెంకటాపూర్ (రామప్ప)

జీపీల ఖజానా ఖాళీ





కట్య్రాలలో పారిశుధ్య పనులు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

- చేసిన పనులకు డబ్బులు రాక మాజీ సర్పంచ్‌ల అవస్థలు
- నెలలుగా వేతనాలందక మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బందులు
- అప్పులు చేసి సర్దుబాటు చేస్తున్నామంటున్న పంచాయతీ కార్యదర్శులు


బచ్చన్నపేట, సెప్టెంబరు 23 : గ్రామ పంచాయతీల్లో గల్లా పెట్టె నిండుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియటంతో స్పెషల్ అధికారులను నియమించారు. పాలకమండళ్లు జీపీలకు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నిలిపి వేసింది. ఎనిమిది మాసాలకు గాను అగస్టు నెలలో మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలలో రూ. 39,74,664 ఎఫ్ఎఫ్‌సీ గ్రాంటును మాత్రమే జమచేశారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రెండున్నర సంవత్సరాలుగా జీపీలో జమ కావలం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో నిత్యం గ్రామంలో పాచి పనులు చేసే మల్టీ పర్పస్ వర్కర్లకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గ్రామాల ఆర్థిక పరిస్థితిని బట్టి మూడు మాసాల నుండి పది నెలలుగా జీతాలు రాక ఇబ్బంధులు పడుతున్నామని దీనంగా చెబుతున్నారు. రోజంతా గ్రామంలో పనిచేసి పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. ఇలాగైతే తాము పనులు చేసేదెలా అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని 283 జీపీలకుగాను 1256 మంది మల్టీపర్పస్, సుమారు 250 మంది వరకు నాన్ మల్టీ పర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. బచ్చన్నపేట మండల పరిధిలో 97 మంది మల్టీ పర్పస్ వర్కర్లుండగా, సుమారు 25 మంది నాన్ మల్టీపర్పస్ వర్కర్లున్నారు.. కాగా వారి కుటుంబ అవసరాల కోసం కొంత డబ్బు సర్దుబాటు చేసేందుకు తాము అప్పులు చేయాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులంటున్నారు. ఆరంభంలో హడావిడి చేసిన స్పెషల్ ఆఫీసర్లు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూడటం లేదని, దీంతో పనిభారమంతా తమపైనే పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల చెల్లింపుతో పాటు ట్రాక్టర్ కిస్తీలు, తాగునీటి సరఫరా నిర్వహణ, విద్యుత్ చార్జీల చెల్లింపులు, పారిశుధ్య పనులకు నిధుల కొరత వేధిస్తోందంటున్నారు.

మాజీ సర్పంచ్‌ల బాధ వర్ణనాతీతం..

లక్షల్లో అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంధులకు గురవుతున్నారు. తమ పదవీకాలం ముగిసి ఎనిమిది మాసాలు గడుస్తున్నా, చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అప్పులను తీర్చేందుకు ఓ సర్పంచ్ తన ఇంటిని తనఖా పెట్టినప్పటికి సగం డబ్బులు తీర్చలేక పోయానని తెలిపాడు. మరో సర్పంచ్ తన భార్య ఒంటిపై నగలు అమ్మి నెల క్రితం వడ్డీ డబ్బులు చెల్లించానని చెబుతున్నాడు. మండల వ్యాప్తంగా 26 జీపీలకు సంబంధించి మాజీ సర్పంచ్‌లకు రూ. 3.50 కోట్ల వరకు బిల్లులు రావల్సి ఉందంటున్నారు. రోజు రోజుకు మానసిక క్షోభ అనుభ విస్తున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పను లు చేయమని పురమాయించిన అధికారులే, నిధులు లేనప్పుడు ఎందుకు చేశారంటూ ప్రస్తుతం మాట్లాడు తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరుణించి తమను ఇబ్బందుల నుండి బయటపడేయాలని వేడుకుంటున్నారు.

తక్కువ వేతనాలైన సకాలంలో రావడం లేదు..

- కొమురవెల్లి శ్రీనివాస్, ఎంపీడబ్ల్యూ జేఏసీ జిల్లా నాయకులు



మాకు వచ్చేదే తక్కువ వేతనం. అది కూడా సకాలంలో రావడం లేదు. పది నెలలుగా జీతం రాని వర్కర్లున్నారు. మా కుటుంబాల పరిస్థితి ఏంటో ఆలోచించాలి. మా డిమాండ్‌ల కోసం అనేక అనేక మార్లు ఆందోళన చేశాం. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ ఏవిధంగా ఉంటుందో అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియంది కాదు. అన్ని ప్రభుత్వాలకు తమపట్టే వివక్ష ఎందుకో అర్థం కావటం లేదు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందనే ఆశతో పనిచేస్తున్నాం.

సర్పంచ్‌లుగా పనిచేసిన వారు కూలీ పనులకు వెళుతున్నారు..

- గంగం సతీష్‌రెడ్డి, సర్పంచ్‌ల పోరం మాజీ జిల్లా ఉపాధ్యక్షులు



సర్పంచ్‌లుగా పనిచేసి పదవీకాలం ముగిసి ఎనమిది మాసాలు గడవక ముందే చేసిన అప్పులు తీర్చే అవకాశం లేక తీవ్ర క్షోభ అనుభవిస్తున్నారు. సొంత వ్యాపారాలు కలిగిన కొద్ది మంది మినహా, దాదాపు అందరి పరిస్థితి అలాగే ఉంది. చేసిన పనులకు ఎంబీ రికార్డులు నమోదయినప్పటికి బిల్లులు రావడం లేదు. లాభాలు రాకున్నా, నష్టాలు చవిచూడకూడదనుకుంటే కొందరు ఇళ్ల తనఖాలు పెట్టి, మరికొందరు భూమి అమ్ముకోవడం, ఇంకొందరు భార్యలపై పుస్తెలు అమ్మి తెచ్చిన డబ్బులకు వడ్డీ చెల్లిస్తున్నారు. మరింత అప్పుల భారంలో కూరుకుపోక ముందే ప్రభుత్వాలు బిల్లుల చెల్లింపులు జరపాలి.

ఝాన్సీరెడ్డి.. డీసీసీ రేసులో?



- జనగామ జిల్లా అధ్యక్ష పదవికి పేరు పరిశీలన
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీకి యత్నాలు
- వీసా నిబంధనల అడ్డంకులతో పోటీకి దూరం
- రాజకీయ ఉద్దండుడు ఎర్రబెల్లిపై తన కోడలిని నిలిపిన ఝాన్సీరెడ్డి
- జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండడంతో అధిష్ఠానం ఆసక్తి

జనగామ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ లీడర్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జనగామ జిల్లా రాజకీయాలపై నజర్ వేశారా? ఎమ్మెల్యే టికెట్ విషయంలో పౌరసత్వం అంశం అడ్డురావడంతో భంగపడ్డ ఆమె పార్టీలో కీలక బాధ్యతలను కోరుకుంటున్నారా? ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం కూడా ఆమె వైపే మొగ్గు చూపుతోందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో తన కోడలిని బరిలో దింపి.. రాజకీయ ఉద్దండుడు ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించడం ద్వారా ఝాన్సీరెడ్డికి పార్టీలో ప్రాధాన్యం పెరిగింది. కానీ పాలకుర్తి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి

మిగతా 8వ పేజీలో...

చిలుపూర్ మండలంలో వరుస చోరీలు

- పట్టపగలు ఇంట్లో చొరబడి దొంగనం
- శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం
- రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ

వివరాలు7లో

తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం..

పాలకుర్తిని అభివృద్ధి చేద్దామనుకున్నాం

కానీ మొదట అవినీతి పరుల భరతం పడతాం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 23: తమపై.. తమ కార్యకర్తలపై గానీ తప్పుడు ఆరోపణలు చేస్తే వీపు విమానం మోత మోగిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు హెచ్చరించారు. దేవరుప్పుల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమామావేశంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి కలిసి మాట్లాడుతూ ప్రజలను మోసగించి, దోచుకొని, దోపిడీ, కబ్జాలు చేసింది రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అని ఆరోపించారు. దయాకర్‌రావు తన అనుచరులతో అన్నీ చేయించి తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పాలకుర్తిలో తాము అడుగుపెట్టి 10 నెలలు కాలేదని ఎలాంటి తప్పులు చేశామో ఆధారాలతో చూపాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి అన్ని తప్పులు చేసి తమ మీద రుద్దడం సరికాదన్నారు. దయాకర్‌రావుతోపాటు ఆయన కార్యకర్తల స్వార్థం కోసం రియల్టర్‌ను బెదిరించి డబ్బులు తీసుకొని జైలు పాలయ్యారన్నారు. చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు ఎవరూ చేసినా ఒకటేనన్నారు. పాలకుర్తిలో తాము అభివృద్ధిపై దృష్టి పెడదామని ప్రిపరేషన్‌లో ఉంటే అవసర విషయాలపై రాద్ధాంతం చేస్తూ తమపై బురద జల్లుతున్నారన్నారు. మొదట అవినీతి పరుల భరతం పడతామని, ఏ పార్టీ వారైనా, చివరికి మా పార్టీ వారైనా అవినీతి, తప్పు చేస్తే ఇక ఉపేక్షించబోమన్నారు. వీరోచితంగా పోరాడిన యోధుల గడ్డ అయిన పాలకుర్తిలో, దేవరుప్పుల ప్రజలు చైతన్యవంతులని కొనియాడారు. దయాకర్‌రావు పాలకుర్తిలో ఓటమి చవి చూసి పదినెలలు గడిచిందని, ప్రజలు వద్దనుకొని తమకు పట్టం కట్టారన్నారు. ఇప్పటికీ దయాకర్‌రావు, ఆయన కార్యకర్తలు ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఖబడ్దార్ దయాకర్‌రావు నేటి నుంచి మిమ్మల్ని మీ కార్యకర్తలకు స్టార్ట్ అయిందని రాళ్లతో కొట్టేరోజు వచ్చిందన్నారు. త్వరలో పాలకుర్తికి హైడ్రా తీసుకు వస్తామని ఎవరెవరు ఏమి కబ్జాలు చేశారో బయటకు తీసుకొచ్చి కబ్జా దారులను ప్రజల ముందుంచుతామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, నాయకులు ఉప్పల సురేష్‌బాబు, తోటకూరి పాంగు కృష్ణ, కాడబోయిన గణేష్, వంగ దశరథ, రాంచంద్రునాయక్, సురంజన్‌రెడ్డి, దొపాటి రవి, పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యమివ్వాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఆర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 23: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్నతో కలిసి మొత్తం 130 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత ఆధికారులను ఆదేశించారు. అర్జీల పట్ల ఎటువంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. సమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సరిత, డీఆర్‌డీవో వసంత, సీపీవోఎల్ శ్రీనివాస్, డీఈవో రాము, డీపీవో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నెల్లుట్ల చెరువు శుద్ధికి చర్యలు

- ఎస్‌టీపీ ఏర్పాటుకు రూ.2కోట్లు మంజూరు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



పటేల్‌గూడెం వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం

లింగాలఘణపురం, సెప్టెంబరు 23: జనగామ మున్సిపాల్టీకి చెందిన మురుగునీటితో పూర్తిగా కలుషితమవుతున్న నెల్లుట్ల చెరువును పూర్తిగా శుద్ధి చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం లింగాలఘణపురం మండలంలో నెల్లుట్ల, కుందారం, చీటూరు గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యే పలువురు బాధితుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పటేల్‌గూడెం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరద నీటికి ధ్వంసమైన రోడ్డుతో పాటుగా నెల్లుట్లలో కూలిపోయిన వంతెనను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భారీ వరదల కారణంగా పటేల్‌గూడెం వద్ద రోడ్డు ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని అదేవిధంగా నెల్లుట్లలో స్మశాన వాటికకు వెళ్లాల్సిన వంతెన పూర్తిగా కూలిపోయిందన్నారు. పటేల్‌గూడెం వద్ద తెగి పోయిన రోడ్డును నిర్మాణం చేసి వెంటనే రాకపోకలు పునరు ద్ధరణ అయ్యేవిధంగా అవసరమైన చర్యలను 24గంటల్లో చేప డుతామన్నారు. ప్రధానంగా నెల్లుట్ల చెరువు మురుగునీటితో కలుషితమవుతుందని, మురుగునీటిని తొలగించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొల్లూరి శివకుమార్, పోరెడ్డి మల్లారెడ్డి, దిలీప్‌రెడ్డి, నాగేందర్, దామెర నాగరాజు, బత్తిని అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: జెమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం దీని ద్వారా ప్రజలకు ఏం లాభమో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ఇంట్లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిపినా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే కేంద్ర ప్రభుత్వం జెమిలీ ప్రతిపాదనలు తీసుకువస్తుందన్నారు. కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమకు అభ్యంతరం లేదన్నారు. పేదల ఇండ్లను కూల్చివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 1400 కోట్లతో నిర్మిస్తున్న ఎల్కతుర్తి-రామాయణపేట హైవే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలన్నారు. ఈ నెల 26న హైవేపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అందరి రైతులకు అందడం లేదన్నారు. ఇటీవల వియత్నాం దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సీపీఐ నాయకురాలు మంచాల రమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, బీ సంపత్, అశోక్, స్టాలిన్, రమాదేవి, రామచంద్రారెడ్డి, తిరుపతి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, గడ్డం రాజనర్సు, కృష్ణారెడ్డి, రొంటాల శ్యామ్, వేల్పుల చరణ్, రవితేజ, బీ సదానందం తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

కేయూ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3,4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్టాత్మక అట్లాంటిక్ ఫెడరేషన్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సులో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ' మ్యాథమేటికల్ టెక్నిక్స్ ఇన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ (ఐసీఎంటీఈఏ-24) ఏ సోల్యూషన్ టూ పజి స్టోకాస్టిక్ లీనియర్ సిస్టమ్స్ యూజింగ్ ట్రయాంగులర్ అండ్ న్యూసిమెట్రిక్ స్ప్లిటింగ్ ఇంటరేటివ్ మెథడ్ అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ .మల్లారెడ్డి, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు భారవిశర్మ, సోమయ్య, తిరుమలదేవి అభినందించారు.



రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, పలు బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఎంఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 10కోట్లు, పంచాయతీరాజ్ సీఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎక్స్ రోడ్ నుంచి రసూల్‌పల్లిలో రూ. 86లక్షలతో బీటీ రోడ్, భీమదేవరపల్లి మండలంలోని అవల్దార్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి ఎర్రబెల్లి వరకు రూ. 37లక్షల బిటీ రోడ్, గట్లనర్సింగాపూర్, లంబాడితండ ఎక్స్ రోడ్ వరకు రూ. 374లక్షలు, ముల్కనూర్ ఎస్‌బీహెచ్ నుంచి కొత్తపల్లి ఎక్స్ రోడ్ వరకు రూ. 135లక్షలు, భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఎక్స్ రోడ్‌కు రూ. 117లక్షలు, మండలంలోని వంగర ఎర్రగడ్డ కల్వర్టు నిర్మాణం, బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. బాలుర విభాగంలో జి. విద్యాధన్, ఎం. అభినవ్ రెడ్డి, అల్లాడి శ్రీవాత్సవ్, డి. జితేష్ బాలికల విభాగంలో జాన్వీ తోట, పి. లక్ష్మీశార్వాణి, కె. ఆరాధ్య, ఎం. హాస్య లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి అక్టోబరు చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కన్నా వెల్లడించారు. ఈ మేరకు విజేతులుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ఇద్దరు సీఐలు, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు ఎం.అబ్బయ్య సీసీఎస్ వరంగల్ నుంచి నర్మెట్ట, ఎం.సాయిరమణ నర్మెట్ట నుంచి దుగ్గొండి అలాగే ఎస్ఐలు చింత రాజు ఇంతజార్‌గంజ్ నుంచి కొడకండ్ల, ఎస్.రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగాంకు బదిలీ అయ్యారు.

ఫాంహౌస్ పాలన కాదు మాది ప్రజాపాలన

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వంగపహాడ్‌లో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఫాంహౌస్ నుంచి మానిటరింగ్ చేసిన ప్రభుత్వం మాది కాదని ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నిజమైన ప్రభుత్వం మాది అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం, గోదామును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పని చేస్తున్నా కొందరు బీఆర్ఎస్ నాయకులు, ట్విట్టర్ వేదికగా కామెంట్స్ చేయడం సరైంది కాదని మండి పడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు రుణమాఫీ చేయాలంటే అష్టకష్టాలు పడేవారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారే రూ. 2 లక్షల రుణ మాఫీ చేశాడని గుర్తు చేశారు. ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో కొన్ని సాకేంతిక కారణాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో ట్వి ట్టర్ టిల్లు, కౌశిక్‌రెడ్డి వంటి అటెన్షన్ డైవర్షన్ బ్యాచ్ పని చేస్తుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదికగా దుర్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు.

టెక్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వంగపహాడ్ పీఏసీఎస్ ఏపీబీ బ్యాంకు నుంచి డీసీసీబీకి మార్చమని పాలక వర్గం సభ్యులు చాలా సార్లు కోరారని అతి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పీఏసీఎస్ భవనం రూ. 30 లక్షలతో నిర్మాణం జరిగిందని చైర్మన్ మేరుగు రాజేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నీరజ, డీసీసీబీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్లు రుద్రారపు రాజు, మేరుగు రేణుక, గండు అశోక్ యాదవ్, పావం జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



వంగపహాడ్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ప్రపంచ టాప్ శాస్త్రవేత్తలలో

వరంగల్ ప్రొఫెసర్‌కు చోటు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23: ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. ఇటీవల స్టాన్ ఫర్డ్, కాలిఫోర్నియా, ఎన్స్‌వియర్ విశ్వవిద్యాలయాలు కలిసి ప్రపంచంలోని టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందించాయి. ఈ జాబితాలో డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు స్థానం దక్కింది. 2021-2023 కొనసాగే ఈ ప్రతిష్టాత్మక జాబితాలో స్థానం సంపాదించారు. న్యూరో సర్జరీ, న్యూరో శాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా నిలిచారు. అమెరికాలోని నాసా, ఏమోరి యూనివర్సిటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, టెక్సాస్ విశ్వవిద్యాలయం లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు. డాక్టర్ రమేశ్ 100కు పైగా పరిశోధన పత్రాలను, అల్జీమర్స్, స్కిజోఫినియా, ఆంటి వ్యాధులపై ప్రచురించారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌ను పలువురు ఐఎంఏ వైద్యులు ప్రశంసించారు.



డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 : కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష 24 కార్యక్రమం మూడవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం ఇంపల్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సైక్లింగ్, పరుగెత్తడం, జంపింగ్, క్లైంబింగ్, ఇతర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్లు చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్నారు. సాయంత్రం విద్యార్థులు చిత్రలహరి (షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్) ఇందులో మెడికల్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కాకతీయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక దంపతుల కూతురుకు ఉత్కర్ష అనే పేరు పెట్టారు. కేఎంసీలో మాకు చాలా నేర్పిందని, కాలేజీ మీద ఉన్న ప్రేమతో తమ కూతురికి ఉత్కర్ష అనే పేరును పెట్టినట్లు వారు తెలిపారు. మంగళవారం విద్యార్థులు మెగా రక్తదాన శిబిరం, సాయంత్రం కార్నివల్ నైట్ నిర్వహించనున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట, సెప్టెంబరు 23 : కాజీపేట టౌన్ - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఎఫ్ క్యాబిన్ వద్ద సోమవారం మూడో లైన్ బైపాస్ పనులు చేపట్టారు. రైల్వే అధికారులు పర్యవేక్షణలో 400 మంది గ్యాంగ్‌మెన్‌లు ఒక యూనిట్‌గా ఏర్పడి లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టారు. నాలుగు గంటలు బ్లాక్ తీసుకుని ఈ పనులు చేపట్టడంతో కాజీపేట, బల్లార్షా, వరంగల్ రైల్వే స్టేషన్ల మార్గంలోని పలు రైళ్లు అలస్యంగా నడిచాయి. పనుల అనంతరం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ పనులు డిప్యూటీ సీఈ భార్గవ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భటియా, టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూ గోపిల పర్యవేక్షణలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

'నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ప్రయోజనాలు'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు ఎన్నో ప్రయో జనాలు ఉన్నాయని ఏపీ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఉద యభాస్కర్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన నేషనల్ పెన్షన్ స్కీంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఎన్‌పీఎస్‌లోకి మారాలని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం అడిట్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని సూచించారు. 80 సీడీసీ కింద ఐటీ కోసం ఎన్‌పీఎస్ అవసరం ఉంటుందని చెప్పారు. అనంతరం వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారులు తమను ఎన్‌పీఎస్‌లోకి మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కామర్స్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సదస్సులో వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'రామప్ప' భద్రత.. గాలిలో దీపమేనా?

- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రక్షణ కరువైంది. పర్యాటకంగా ప్రపంచ పటంలో ఉన్నత స్థానం పొందినా స్థానికంగా మాత్రం ఈ వారసత్వ సంపదకు రక్షణ కరువైంది. ఇక ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న 20 ఉప ఆలయాల భద్రత గాలిలో దీపంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి రామప్పను అభివృద్ధి చేస్తున్నా రక్షణ కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. తాజాగా గొల్లాలగుడి తవ్వకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న రామలింగేశ్వరుడి రక్షణపై భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

వీవీఐపీలు వచ్చినప్పుడే రక్షణ

సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి 2022 జూలైలో యునెస్కో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావడం కోసం కేంద్ర పురావస్తుశాఖ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాయి. గుర్తింపు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. గుర్తింపు వచ్చాక రాష్ట్రపతి మొదలు అనేక మంది వీవీఐపీలు రామప్పను సందర్శించిన సమయంలో మాత్రమే పోలీసులు రక్షణగా వస్తున్నారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా రామలింగేశ్వరుడికి రక్షణ కరువవుతోంది.

ఉప ఆలయాలనూ గాలికొదిలేశారు..

రామప్ప ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలు, ప్రధాన ఆలయాలు చుట్టుపక్కల ఉన్నాయి. వాటి రక్షణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా గొల్లాలగుడిలో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఏకంగా 1000కిలోల బరువు ఉన్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని పైకప్పు కిందికి తోశారు. కిందకు తోశాక ప్రాకారం పైభాగంలో పుష్పాకారంలో ఉన్న టంకాన్ని పగులగొట్టారు. ఇదంతా ఒకరిద్దరు కలిసి చేసిన పనికాదని జరిగిన ఘటనను పరిశీలిస్తే తెలుస్తోంది. స్థానికుల సహకారం ఉంటే తప్ప ఇంత బరువును కిందికి తోయలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కనుక ఈఘటనను సిబ్బంది చూసి ఉండకపోతే దుండగులు మరికొన్ని ఉప ఆలయాలపై కూడా ఇదే తరహాలో దాడులకు పాల్పడి ఉండేవారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు చేస్తున్నా సీసీ కెమెరాలు కరువు

యునెస్కో గుర్తింపు పొందిన అనంతరం రామప్ప పరిసర ప్రాంగణంలో రూ.కోట్లు వెచ్చించి చేస్తున్న పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అటు కాంట్రాక్టర్లు కానీ, ఇటు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులకు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే కనీసం గుర్తించేందుకు సీసీ కెమెరా లు కూడా లేవు. పైగా ఆలయం వద్ద ఇలాంటి సెక్యూ రిటీని కూడా నియమించకపోవడం పట్ల సర్వత్రా వి మర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు వచ్చినా ఇంకా అభద్రతలోనే రామప్ప ఆలయం ఉంద ని స్థానికులు వాపోతున్నారు.

టంఖంలో వజ్రాలు ఉన్నాయనే..

రామప్ప ఆలయానికి సమీపంలోని గొల్లాలగుడిలో రెండురోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరి గినట్టు వెలుగులోకి వచ్చిన క్రమంలో ఆలయం పై భాగంలో ఉన్న పుష్పాకారపు పైకప్పు భాగంలో ఉన్న టంఖాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఆటంఖంలో వజ్ర, వైఢూర్యాలు ఉన్నాయనే ఆశతో కొందరు వ్యక్తు లు దానిని పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పైభాగం నుంచి కిందికి తీసుకురావడానికి సుమారు 10మంది ప్రయత్నంచేస్తే తప్ప ఆ ప్రకారం కిందికి వచ్చే అవకాశంలేదని స్థానికులు భావిస్తున్నారు.

20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే


రామప్ప దేవాలయం ఆవరణలోని గొల్లాలగుడి


దీపశిఖలతో చెక్కిన టంఖం

రామప్ప గుడులకు రక్షణ కల్పించాలి


ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్

రామప్ప ప్రధాన ఆలయం తోపాటు దాని పరిధిలో ఉన్న గుడులను వెలికితీసి వాటికి ర క్షణ కవచాలను ఏర్పాటు చేసి ఆలయాలకు భద్రత కల్పించా లి. గొల్లాలగుడి పైకప్పు దీప శిఖలో అనేక కళాకృతులు చెక్కి ఉండేవి. అలాంటి అనేక కళాకృతులు మరుగునపడి ఉన్నాయి. వాటి ని నియంత్రిత రక్షణ వ్యవస్థ పరిధిలో ఉంచాలి. అలాగే పురావస్తుశాఖ రక్షణ, నిర్వహణ సిబ్బంది ని పెంచాలి.

ప్రధాన ఆలయంపై కన్నేస్తే ఇక అంతే..

రామప్ప ప్రధాన ఆలయం పరిధుల్లో దుండగులు ఎలాంటి తవ్వకాలు చేపట్టినా అంతర్జాతీయ పర్యాటక సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుంది. కనీస స్థాయి భద్రత కల్పించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో ఉన్న త స్థానం సంపాదించిన రామప్పకు ఇప్పటికైనా రక్షణ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గొల్లాలగుడిని సందర్శించిన కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు, గొల్లాల గుడిని సోమవారం ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఏరియా మ్యాపింగ్ సర్వేచేసి బౌండ్రీ పిల్లర్ ఫిక్స్ చేయాలన్నారు. కెనాల్‌కు సంబంధించిన ఏరియా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాలగుడిని సందర్శించి గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులో వికసించే తామరపువ్వు గుర్తుతో ఉండి పూర్తిగా ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించారు. దేవాలయం పూర్తి వివరాలను పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దేవాలయంలో ధ్వంసమైన శిల్పం, పువ్వు, అన్ని డాక్యుమెంట్ చేయాలని, రాత్రి కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి మల్లేశం, ఇరిగేషన్ డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


ధ్వంసమైన శిల్పాలను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర


ప్రాజెక్టు పనుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్న కాళేశ్వరంపై చిగురిస్తున్న ఆశలు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించేందుకు గాను చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. సుమారుగా 45వేల ఎకరాల పంట భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 70వేల ఎకరాల భూ సేకరణకు రూ.14 కోట్లు, వీరసాగర్‌లో సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు రూ.31.39 కోట్ల నిధులు మంజూరైనట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ప్రస్తుతం ఈఈ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నేడు కాళేశ్వరానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాక

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులు మంగళవారం రానున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధానంలో సరస్వతి పుష్కరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సరస్వతి పుష్కరాల సమావేశాలు నిర్వహించడానికి ముందస్తుగా కాళేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రూ.25 కోట్లతో 8ఏళ్ల క్రితం మంజూరైన పనులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది.

30న విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో విజేతలైన విద్యార్థులు దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలైన విద్యార్థులు జనవరి 2025లో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆమె సూచించారు.

బోగస్ పాలనతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు

- ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదు
- ఇప్పటి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కేయూ సింపోజియంలో సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కేసీఆర్ పాలనంతా బోగస్‌గా సాగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ అధ్యక్షతన 'డికెడెల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ఇష్యూస్ చాలెంజెస్' అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలందరూ ఉద్యమం చేసి ఆశించిన డెమోక్రటిక్ పాలిటిక్స్‌కు బదులుగా విరుద్ధమైన పాలన సాగించారని విశ్లేషించారు. బీఆర్ఎస్ పాలన నిర్బంధం, నిరంకుశత్వంతో పాలన సాగిందన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమంగా 221 కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ వర్సిటీలకు భారీగా నిధుల్లో కోత విధించిందని, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లో అధికారం చేపట్టగానే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, వలసలతో పాటు అస్తిత్వం కోల్పోయిన యువత ఆకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తమది పక్కా రాజకీయ పార్టీ అంటూ రాష్ట్రం కోసం పోరాడిన మేధావులు, యువత, విద్యావేత్తల ఆలోచనలు పట్టించుకోలేదని అన్నారు. ఖరీఫ్‌లో రైతుల పేరుతో నమోదైన భూములను ధరణి పోర్టల్‌లో సాయంత్రం పని ప్రారంభించి రాత్రికి తమకు అనుకూలమైన పేర్లకు మార్చేవారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని మిగతా నీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. కేసీఆర్ తన హయంలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డీ.నరసింహారెడ్డి కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ళు నిధులు, నియామకాల కోసమే అంటూ ప్రగల్భాలు పలికినప్పటికీ తీర రాష్ట్రం సిద్ధించిన తర్వాత వాటిని మరిచారని అన్నారు. తమిళనాడుతో పోలిస్తే తెలంగాణలో విద్య ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో దత్తాంశాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీతో పాటు నిధుల కొరత ఉందన్నారు. పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి హైదరాబాద్‌లో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు.

కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి, సమస్యలు, సవాళ్లకు సరైన మార్గదర్శనంగా సింపో జియం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్ననా యక్, ప్రొఫెసర్ సీహెచ్. సమ్మయ్య కృష్ణమాచారి, పరిశోధకులు జి.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి త్వరలో నోటిఫికేషన్?

- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీసీ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కాకతీయ యూనివర్సిటీలో ఏడేళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, వర్సిటీలో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగకపోవడం, విద్యార్థులు పడుతున్న పలు ఇబ్బందులను వివరిస్తూ 'పాఠాలు చెప్పే వారేరీ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి.. సమస్య గురించి రాష్ట్ర ఉన్నతా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు తమకు వీసీ నుంచి సమాచారం అందిందని వర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌లు, పార్టుటైం ఆశావాహులు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని తాము రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లామని, వర్సిటీలో ఉన్న పరిస్థితులను విన్నవించామని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందించి.. పార్టుటైం నోటిఫికేషన్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతిలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా సోమవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగిన అర్థశాస్త్ర విభాగం సింపోజియంలో వర్సిటీల్లో పార్టుటైం నియామకాల్లేవనే అంశాన్ని పలువురు మాట్లాడారు. వర్సిటీలో అధ్యాపక నియామలు చేపట్టకపోవడంతో ఒక తరానికి నష్టం చేసినట్లేనని ఆందోళన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం..

సోమవారం వర్సిటీకి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పీహెచ్‌డీ డాక్టరేట్లు, ఆశవహులు 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సమస్యలను విని స్పందించిన కోదండరాం వెంటనే వర్సిటీ క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో చర్చించారు. పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదలకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణల దృష్టికి తీసుకెళ్లి పార్టుటైం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తాము ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలపై దృష్టి సారించామని.. వీలైనంత త్వరగా ఇస్తామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.


కోదండరాంకు వినతి పత్రాన్ని ఇస్తున్న వర్సిటీ డాక్టరేట్ అభ్యర్థులు

27న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్, హనుమకొండలోని అపోలో ఫార్మసీ కేంద్రాల్లో ఫార్మసిస్ట్/అసిస్టెంట్/అప్రెంటిషిప్‌గా పనిచేసేందుకు 50 ఖాళీలకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు వారి జిరాక్స్ సర్టిఫికేట్లతో ఈ నెల 27న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి విరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు-రూ.లలో)

పంట	గరిష్ఠం	కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2,660	2,405
పల్లికాయ (సూక)	5,600	4,500
పల్లికాయ (పచ్చిది)	4,400	3,800
కందులు	8,059	7,575
పెసళ్లు	7,652	4,052
పత్తి	7,650	5,500
కొత్తపత్తి	7,225	6,500
పసుపు (కాడి)	13,130	12,000
పసుపు (గోల)	12,455	10,800
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,800	14,000
వండర్‌హాట్ ఏసీ	15,000	13,000
యూఎస్341 ఏసీ	16,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం


శివాత్మికను విజేతంగా ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో శివాత్మికకు బంగారు పతకం

హనుమకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండకు చెందిన సిహెచ్ శివాత్మిక అండర్ 17 (42 కేజీ) విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 650మంది పోటీ పడ్డారు. వీరందరిని దాటుకొని విజేతగా నిలిచిన హనుమకొండ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన శివాత్మిక నవంబర్ నెలలో ఉత్తరాఖండ్‌లో జరుగబోయే జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొనేందు కు ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన శివాత్మికను తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్ బండారి సంతోష్, కోచ్‌లు రామ్‌చందర్, సాగర్, కర్ర వెంకటేశ్, సిహెచ్ కరుణాకర్, సీహెచ్ సుప్రియ, పి దినేష్, ఏ గణేష్, యూ రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

చిలుపూర్‌లో పట్టపగలు దొంగతనం

- హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు
- ఓ ఇంట్లో చొరబడి మూడు తులాల గొలుసు చోరీ

చిలుపూర్, సెప్టెంబరు 23 : పట్టపగలు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుల్లో ఒకరు ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల గొలుసుకును లాక్కెళ్ళాడు. అనంతరం బైక్‌పై ఇద్దరూ పారిపోయారు. ఈ ఘటన చిలుపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ జంగిటి రాధిక -లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక తన భర్త వివిధ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్ళడంతో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంట్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఈ లోగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటి ముందు ఆగారు. ఒకరు బైక్ దగ్గర ఉండగా, మరొక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. వచ్చీరాగానే కత్తితో పొడిచి చంపుతానని మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని బెదిరించాడు. అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ప్రయత్నం ఫలించకపోగా, ఆమె మెడలో ఉన్న మూడు తులాల (రూ.2.50 లక్షల విలువ గల) బంగారు గొలుసును లాక్కెళ్ళి పారిపోయారు. బాధిత మహిళ రాధిక -లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చిలుపూర్‌లో దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ

చిలుపూర్, సెప్టెంబరు 23 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.15లక్షల నగదుతో పాటు, 10తులాల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్ళిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మూడికె లక్ష్మికి భర్త కొన్నేళ్ళ క్రితం చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును చూడడం కోసం ఐదు రోజుల క్రితం లక్ష్మి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సొత్తును దోచు కెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వెసిన తాళం పగులగొట్టడాన్ని గమనించిన సమీప బంధువులు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో సమీప గ్రామంలో లక్ష్మి కుమార్తె హారిక గ్రామానికి చేరుకుంది. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి చిలుపూర్, శ్రీపతిపల్లి గ్రామాలకు చేరుకున్నారు. దొంగతనాలు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు మామునూరు నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://navodaya.gov.in అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

'పద్మావతి' హాల్టింగ్ అయోమయం

- నెక్కొండలో డౌన్‌కు ఓకే.. అప్‌కు నో...
- ప్రైవేట్ యాప్‌లలో తప్పుడు సమాచారంతో ప్రయాణికుల ఇబ్బందులు


ఓ యాప్‌లో నెక్కొండలో హాల్టింగ్ చూపుతున్న దృశ్యం

నెక్కొండ, సెప్టెంబరు 23 : సికింద్రాబాద్-తిరుపతి (12764 / 12763) పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ విషయంలో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండగా.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైళ్లకు హాల్టింగ్ లేదు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు అప్ హాల్టింగ్ ఇప్పించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను కోరారు. దాంతో మూడు నెలలుగా నెక్కొండ స్టేషన్‌లో అప్ హాల్టింగ్ ఇప్పించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటే అయింది. ఈనెల 15 నుంచి అప్ హాల్టింగ్‌ను రద్దుచేశారు. కానీ ప్రైవేట్ యాప్‌ల్లో మాత్రం నెక్కొండలో పద్మావతి అప్ హాల్టింగ్ చూపుతుండడంతో తికమకపడుతున్నారు. ఇక తిరుపతి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల మంది వెళ్తుంటారు. నెక్కొండ స్టేషన్‌లో రైలు ఎక్కి తిరుపతి వెళ్లి.. తిరుగుప్రయాణంలో అదే రైల్లో నెక్కొండకు రావాలని భావిస్తున్నారు. కానీ ఈ స్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో వరంగల్‌లో దిగాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేట్ యాప్(ఆన్‌లైన్)లో నెక్కొండ స్టేషన్‌లో అప్ పద్మావతి హాల్టింగ్ చూపించడంతో ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 23: తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్నటువంటి పొట్టి శ్రీరాములు పేరును మర్చాలని చూస్తే సహించేది లేదని అవసరమైతే ఆందోళన ఉద్యమం తప్పదని ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు పార్శి కమల్‌కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడుతామని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేఖిస్తూ సోమవారం నాయకులు నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు తెల్లాకుల రామకృష్ణ, గన్ను నర్సింహులు, పాలకుర్తి సోమశేఖర్, అయిత బుచ్చిబాబు, నాగబండి వెంకట్రాం నర్సయ్య, పార్శి క్రిష్ణారావు పాల్గొన్నారు.

● చిలుపూర్ : తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు మంతెన లవన్ కుమార్ గుప్త డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు మారం లింగమూర్తి, మోదె రాజేందర్, బాబు, గుజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తరిగొప్పుల : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్య నాయకులు

బెజుగం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వారు మొదటగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నాగేశ్వర చారికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మాశెట్టి వేణుగోపాల్, కోశాధికారి జిడిగం సుధాకర్, నాయకులు తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, బబ్బుల సంపత్‌కుమార్, కౌడ మల్లిఖార్జున్, బచ్చు శ్రీమన్నారయణ, జిడిగం ప్రదీప్ పాల్గొన్నారు.

● దేవరుప్పుల : యాభై ఎనమిది సంవత్సరాలు నిరాహారదీక్ష చేసి మద్రాస్‌లో కలిసి ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్‌ను సాధించిన పొట్టి శ్రీరాములు మరిపింప చేసే విధంగా కుట్రలు జరుగుతున్నాయని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బుక్కా రామయ్య ఆరోపించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఇరుకుల శ్రీనివాస్, బెలిదె నర్సయ్య, వనమాల శ్రీనివాస్, బుక్కా శ్రీధర్, వనమాల సోమలింగం పాల్గొన్నారు.

● జఫర్‌గడ్, తెలుగు విశ్వవిద్యాలయానికి ఉండబడిన పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని ఆర్యవైశ్యులు వ్యతిరేకిస్తూ సోమవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఆర్యవైశ్యులంతా కలిసి నల్లబ్యాడ్జీలను ధరించి ప్రధాన వీధుల గుండా తహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిటిమళ్ల కృష్ణమూర్తి, అంచూరి యుగంధర్, రాజన్న పాల్గొన్నారు.

● పాలకుర్తి : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరులో మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందచేశారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు చీదర జగదీష్ మాట్లాడారు. కార్యక్రమంలో బోనగిరి రంగయ్య, బజ్జూరి వేణుగోపాల్, దొడ్డ వెంకటేశ్వర్లు, నాగమల్ల సోమేశ్వర్ ఉన్నారు.

దేశ్‌ముఖ్ దొరసానిలా వ్యవహరిస్తున్న ఝాన్సీరెడ్డి

-బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 23: పాలకుర్తి గడ్డపై జానమ్మ దొర సాని పోయి ఝాన్సమ్మ దొరసా ని వచ్చిందని దేశ్‌ముఖ్‌లా వ్యవహరించి ప్రజలపై అక్రమ కేసులు పెట్టించి భయ భ్రాం త్రులకు గురిచేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం దేవరుప్పులలో మండల బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నమడూరులో రియల్‌ఎస్టేట్ భూముల వ్యవహారంలో పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఝాన్సీరెడ్డి తలదూర్చి కిడ్నాప్‌లు చేయించి దానికి సమాధానం చెప్పకుండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వంగ అర్జున్, గొడుగు మల్లికార్జులపై పోలీసులతో తప్పుడు కేసు పెట్టించిందన్నారు. రియల్టర్ కొనుక్కున్న భూములను చదును చేసే విషయంలో 14నెలల కింద జరిగిన లావాదేవీలను బెదిరించి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణతో వారిపై అక్రమంగా కేసులో ఇరికించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్, మండల అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాల్కూరికి పేరే పెట్టాలి

పాలక్మ, సెప్టెంబరు 23 : తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదకవి పాల్కూరికి పేరు మాత్రమే పెట్టాలని సోమనాధ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి అందచేసింది. ఆ పీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, భూమ రంగయ్య, ఎడవెల్లి వెంకన్న, బజ్జూరి శ్యామ్‌ప్రసాద్, కరుణాకర్, వెంకన్న రమేష్, రాపాక విజయ్, గుమ్మడిరాజు సాంబయ్య, గూడూరు లెనిన్ ఉన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలు

● బినామి పేర్లపై పనులు ● గ్రామసభలో బయటపడ్డ నిజాలు

నర్మెట, సెప్టెంబరు 23 : మండలంలోని ఉషికబాయితండ గ్రామ పంచాయతీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు భారీగా జరిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్లు గ్రామానికి చెందిన బానోతు బాలు ఎంపీడీవో అరవింద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఉషికబాయితండలో ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో ఉపాధిహామీ పనులు చేసిన వారి పేర్లు చదువుతుండగా పని చేయనివారి పేర్లు రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఓ ఆర్టీసీ డ్రైవర్ కూడా ఉపాధీ హామి పని చేసి బిల్లు చెల్లించినట్లు ఉంది. అదేవిధంగా గ్రామ మాజీ సర్పంచ్ బానోతు అనితమంగినియా కుటుంబం కూడా పని చేసి డబ్బులు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉంది. అసలు వారు పని చేయలేదని గ్రామస్తులు చెప్తున్నారు. వారి పేర్లపై ఇతర వ్యక్తులు పని చేశారు. గ్రామంలో మొత్తం 155 జాబ్ కార్డులు ఉండగా అందులో 143 మంది జాబ్ కార్డులున్న వ్యక్తులు పని చేయగా సూమారు రూ. 14లక్షలకు పైగా చెల్లింపులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఫిల్ అసిస్టెంట్, మేట్ ఇద్దరు కలిసి పని చేయని వారి పేర్లు, హైద్రాబాద్‌లో ఉంటున్న వారి పేర్లు పనులు చేసినట్లు మస్టర్‌లలో రాసారు. గ్రామంలో ఎనభై నుంచి తొంభై మంది మాత్రమే పని చేశారని, మిగతా వారి పేర్లు పనులు చేయని వారివేని, 3 నుంచి 4 లక్షల వరకు పనులు చేయని వారికి బిల్లులు చెల్లించి వారి నుంచి సగం డబ్బులు కాజేసారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 33 మంది పని చేయని వారికి బిల్లులు చెల్లించినట్లు తేలిందని ఎంపీడీవో అరవింద్ తెలిపారు. పని చేయకుండా బిల్లులు తీసుకున్న వారికి నోటీసులు ఇచ్చి డబ్బులు రికవరీ చేస్తామన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకంటామని ఎంపీడీవో అరవింద్ తెలిపారు. పూర్తి విచారణ జరిగితే భారీ అవినితి జరిగినట్లు తెలుతుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో ఏపీవో రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడకండ్ల, సెప్టెంబర్ 23 : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన కీసర సుభాష్ రెడ్డి , రామన్నగూడెం గ్రామానికి చెందిన కున్సోత్ మంగమ్మలు ఇటావల అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారి ఇండ్లకు సోమవారం వెళ్ళి సుభాష్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సింధె రామోజి, కీసర ఉమ్మేందర్ రెడ్డి, పేరం రాము, చెంచు రాజిరెడ్డి, గాంధీనాయక్, కుంచం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకురాలి పరామర్శ

కొడకండ్ల, సెప్టెంబర్ 23 : మండలకేంద్రానికి చెందిన అందె వెంకటయ్య, మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన కీసర సుభాష్ రెడ్డి , రంగాపురం గ్రామానికి చెందిన కుందూరు పురుషోత్తం, రామవరం గ్రామానికి చెందిన దుంబల లక్ష్మోజి, రామన్నగూడెం గ్రామానికి చెందిన కున్సోత్ మంగమ్మ, గడ్డం జయమ్మలు ఇటీవల అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలిసిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి ఝాన్సీరెడ్డి వారి ఇండ్లకు సోమవారం వెళ్ళి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్, అందె సువర్ణ, ప్రసాద్‌రెడ్డి, అందె యాకయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారాన్ని అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 21: ఎదిగే పిల్లలకు పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దు అని ఇప్పగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రణీత తెలిపారు. సోమవారం మండలంలోని సముద్రాల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను ఆమె సందర్శించారు. సెంటర్లలో ఉన్న చిన్నారుల బరువును ఆమె నేరుగా పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎల్ రమణ, హెచ్‌వీ పర్వీన్‌సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఏఎన్ఎం లత, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడల ప్రారంభం

తరిగొప్పుల, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బానోతు రవీందర్ చేతుల మీదుగా సోమవారం మండలస్థాయి అండర్ 14, 17 క్రీడలు ప్రారంభించారు. బండి బాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు విజయ పాల్గొన్నారు.

కిడ్నాప్ వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదు

దేవరుప్పుల, సెప్టెంబరు 23: కిడ్నాప్ వ్యవహారంలో 6గురు వ్యక్తులపై దేవరుప్పుల పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన ప్రకారం చిన్నవడూరులో గ్రామ ధృవ ప్రాజెక్టు వారు కొనుగోలు చేసిన భూమి వ్యవహారంలో పార్టనర్ సోముల పాండురంగంను కొంత మంది వ్యక్తులు కిడ్నాప్ చేశారు. 2024 మార్చి 17న దేవరుప్పులకు చెందిన వ్యక్తి యాకస్వామితో పాటు మరో 5గురు వ్యక్తులు కిడ్నాప్ చేసి జనగామలోని ఒక రూమ్‌లో 3రోజుల పాటు నిర్బంధించి బలవంతంగా దేవరుప్పుల మండల తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నారు. ఐదుగురు వ్యక్తులైన వారిపట్ల రవి కిషోర్, స్వామి, గోరంటి వీరాంజనేయనాయుడు, బలిన సురేంద్ర బాబు, రవి, మరి కొంత మంది కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు లో పేర్కొనట్లు ఎస్సై సృజన్‌కుమార్ వెల్లడించారు. పాండురంగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రఘునాథపల్లి, సెప్టెంబరు 23: ఆనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సంఘటన మండలంలోని మండేలగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని మండేలగూడెం గ్రామానికి చెందిన గాదె నర్సింగం (43) ఈ నెల 15న ఆనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుడి అకాల మరణ వార్త తెలుసుకున్న మండలంలోని ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సహచర మిత్రులు స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయిం చుకున్నారు. ఈ మేరకు మిత్రులందరి దగ్గరి నుండి సేకరించిన రూ.80 వేలను మృతుడి కూతురు గాదె రవళి పేరు మీద సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

రఘునాథపల్లి,సెప్టెంబరు 23: ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి ప్రజల ఇబ్బందులు తీర్చడానికి ఆర్టీసీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జనగామ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్‌కు సోమవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కందుకూరి వంశీ తేజ, ఆర్య, రమేష్, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీపై బీజేపీ నాయకుడి దీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 23: తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేయడాన్ని నిరసిస్తు సోమవారం స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకుడు కొలనుపాక శరత్ కుమార్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. శివునిపల్లి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో వేద పండితుని ఆధ్వర్యంలో ఆయన దీక్ష తీసుకున్నారు. లడ్డూ ప్రసాదం కల్తీకి పాల్పడి ఘోరమైన పాపానికి పాల్పడిన వారిని శిక్షించాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, సెప్టెంబరు 23 : మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన తొర్రూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కూస భాస్కర్ తండ్రి కొంరయ్య సోమవారం మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సందర్శించి మృత దేహంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కొంరయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బిర్రు సోమేశ్వర్, మాజీ సర్పంచు కొంరోజు సోమన్న, సత్తిరెడ్డి, అనుముల మల్లారెడ్డి, అశోక్, మహేందర్, ఎల్లయ్య ఉన్నారు.

గుట్కా ప్యాకెట్లు సీజ్

జనగామ రూరల్, సెప్టెంబరు 23: ప్రభుత్వ నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లను అక్రమంగా డప్ చేశారనే సమాచారంతో ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. రాజస్థాన్‌కు చెందిన గమన రామ్ అనే యువకుడు జిల్లా కేంద్రంలోని కుర్మ వాడలో నివసిస్తున్నాడు. రామ్ ఇంట్లో గుట్కా, అంబర్ ప్యాకెట్లు నిలువ ఉన్నాయనే పక్క సమాచారంతో వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ అదేశాలమేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి రూ. 8,36,920 విలువ గల గుట్కా ప్యాకెట్లను కారును సీజ్ చేసి రామ్‌ను అరెస్ట్ చేసి జనగామ పోలీసులకు అప్పగించారు. నిషేధిత పోగాకు ఉత్పత్తుల ప్యాకెట్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, ఎస్సై వి.దిలిప్‌ను అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన సదస్సు

జనగామ రూరల్, సెప్టెంబరు 23: జనగామ జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ అవరణలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టెలికాం రెగ్యూలేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సీఏజీ మెంబర్ శోభారాణి, ఏజీఎం దయాకర్‌లు పాల్గొని మాట్లాడారు, వినియోగదారులకు మొబైల్ రేడియేషన్, సైబర్ నేరాలు, నకిలీ మోసపూరిత కాల్స్ సందేశాలపై అవగాహన కల్పించారు. బీఎస్ఎన్ఎల్ 4జీ ఆఆధునీకరణ ప్రాజెక్టు, కొత్త ఓఎల్‌టీలు, మొబైల్ బ్యాండ్ సేవలపై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చంద్రగిరి ప్రసాద్, రాంప్రసాద్, శ్రీహరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఈ నెల 26న జాబ్ మేళా

జనగామ రూరల్, సెప్టెంబరు23: జనగామ జిల్లాలోని నిరుద్యోగులకు ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎం, మల్లయ్య సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.హైదరాబాద్‌లోని ప్రైవేట్ సెక్టార్ అపోలో పార్మసీ కంపెనీలో 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నెలకు రూ. 11,600 నుండి రూ. 25,000 పాటు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందిస్తారన్నారు. బీఎం, పార్మసీ, ఎంఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హతలతో 18 నుండి 25 వయస్సు గలవారు ఈనెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్-8లో జరిగే జాబ్ మేళాకు హజరు కాగలరని తెలిపారు. ఇతర వివరాల కొరకు 7995430401 ను సంప్రదించగలరని తెలిపారు

గుండెపోటుతో ఎంఎన్‌వో మృతి

పాలకుర్తి, సెప్టెంబరు 23 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో మేల్ నర్సింగ్ ఆర్డినరి (ఎంఎన్‌వో) గా విధులు నిర్వహిస్తున్న నార్ల కృష్ణ (58) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత 20 ఏళ్లకు పైగా పాలకుర్తిలో పని చేసి స్టేషన్‌ఘన్‌పూర్‌కు బదిలీ వెళ్లి తిరిగి పాలకుర్తికి రెండు నెలల క్రితం బదిలీ వచ్చాడు. కృష్ణ మృతి చెందడం పట్ల ఆస్పత్రి వైద్యులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి చెందడంతో ప్రభుత్వం దహన సంస్కారాలకు రూ. 20 వేలు సాయాన్ని డాక్టర్ సిద్దార్థరెడ్డి అందచేశారు.

కూనూరులో ఉచిత వైద్య శిబిరం

జఫర్‌గడ్, సెప్టెంబరు 23 : మండలంలోని కూనూరులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కూనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ రాజమౌళి నేతృత్వంలో వైద్య బృందం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ చందర్, ఎఎన్ఎం, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బందిపాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 23: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం, లవకుమార్ పాల్గొన్నారు.

డీసీసీ రేసులో.. ఝాన్సీరెడ్డి?

(5వ పేజీ తరువాయి)

పనుల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో తనకు నామినేటెడ్ పదవి కావాలని ఆమె అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్న క్రమంలో జనగామ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆఫర్ చేసినట్టుగా సమాచారం. తనకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే జనగామ జిల్లాలో పార్టీని మరింతగా విస్తరిస్తానన్న ధీమాను అమె వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో జనగామ డీసీసీ పదవిపై ఝాన్సీరెడ్డికి దక్కనుందనే చర్చ కాంగ్రెస్ పార్టీలో జోరుగా సాగుతోంది.

దసరా తర్వాత కొత్త డీసీసీల నియామకం

రాష్ట్రంలో కొత్త డీసీసీ అధ్యక్షుల నియామకానికి అధిష్టానం కసరత్తు చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన జిల్లాల వారీగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా ప్రస్తుత అధ్యక్షులతో పాటు జిల్లాల వారీగా ఆశావహులకు సంబంధించిన నివేదికను తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఆయా జిల్లాల్లో పార్టీలోని ముఖ్య నేతలతో సంప్రదించి డీసీసీ అధ్యక్షుడిని ప్రకటించాలని మహేశ్‌కుమార్‌గౌడ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న వారిని కొనసాగించాలా, వారిని మార్చాలా అన్న అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎవరెవరు పనిచేస్తున్నారు? ఎవరెవరిపై వ్యతిరేకత ఉందన్న అంశాలను ఆయన తెప్పించుకుంటున్నట్టు సమాచారం. కాగా.. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక దసరా తర్వాత డీసీసీ అధ్యక్షుల ప్రకటన ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. కేవలం పనితీరు ప్రాతిపదికనే ఈసారి డీసీసీ అధ్యక్షులను నియమించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మార్చి కొత్త వారికి అవకాశం ఇస్తారా? లేదా ఆయననే కొనసాగిస్తారా అనే చర్చ జరుగుతున్న వేళ అనుహ్యంగా పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఝాన్సీరెడ్డి పేరు తెరపైకి వచ్చింది.

ఎమ్మెల్యే పోటీకి సిద్ధపడి.. నిబంధనలను అడ్డుపడి..

పాలకుర్తి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కాంగ్రెస్ పార్టీ నుంచి ఢీకొనే నేత కరువయ్యారు. అలాంటి పరిస్థితుల్లో ఎర్రబెల్లిపై పోటీకి సై అంటు ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పాలకుర్తి నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేయాలని ఆమె భావించారు. కానీ.. ఎన్ఆర్ఐ అయిన ఝాన్సీరెడ్డికి దేశ పౌరసత్వం విషయంలో నిబంధనలు అడ్డు వచ్చాయి. దీంతో ఆమె ఎమ్మెల్యేగా పోటీకి నామినేషన్ వేయలేని పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆమె తన వారసురాలిగా కోడలు యశస్వినిరెడ్డిని తెరపైకి తెచ్చారు. అప్పుడు మంత్రిగా ఉన్న రాజకీయ ఉద్దండుడైన దయాకర్‌రావును ఎలాగైనా ఓడించాలని ఝాన్సీరెడ్డి కంకణం కట్టుకుని.. ఆయన్ను ఓడించి తన పంతం నెగ్గించుకున్నారు.

పాలకుర్తిలో విజయంతో అధిష్టానం దృష్టిలోకి..

పాలకుర్తి నియోజకవర్గంలో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై గెలుపు తర్వాత కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో ఝాన్సీరెడ్డి కీలకంగా మారారు. ఎర్రబెల్లిని ఓడించడం ద్వారా ఆమె ఇటు పాలకుర్తితో పాటు రాష్ట్ర పార్టీలోనూ మంచి గుర్తింపు పొందారు. ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ప్రభుత్వ వ్యవహారాలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చూస్తుండగా, పార్టీ వ్యవహారాలను నియోజకవర్గ ఇన్‌చార్జ్ హోదాలో ఝాన్సీరెడ్డి చూస్తున్నారు. అయితే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఝాన్సీరెడ్డికి ప్రొటోకాల్ అడ్డు వస్తోంది. దీంతో తనకు నామినేటెడ్ పోస్టు కావాలని సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకొచ్చినట్టుగా పార్టీలో చర్చ జరిగింది. రాష్ట్రస్థాయిలో ఏదైనా కార్పొరేషన్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. అయితే ఝాన్సీరెడ్డికి పదవిపై సీఎం కూడా సానుకూలంగానే ఉన్నారని ప్రచారం జరిగింది. దయాకర్‌రావును ఎదుర్కొనేందుకు ఝాన్సీరెడ్డికి నామినేటెడ్ పదవి పక్కాగా ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలువురు నేతలు కూడా సీఎంకు సూచించారు. అయితే అనూహ్యంగా టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ నియామకం కావటంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను మార్చే యోచనలో పార్టీ అధిష్టానం కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలోనే జనగామ జిల్లా అధ్యక్ష పదవిని ఝాన్సీరెడ్డికి కట్టబెట్టాలనే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్టు తెలిసింది. అయితే ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పార్టీ పరంగా చురుకుగా పని చేస్తున్నా కొత్తవారికి అవకాశమిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. అలాగే మాజీ మంత్రి దయాకర్‌రావును ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఝాన్సీరెడ్డి లాంటి బలమైన నేత అవసనమని పార్టీ భావిస్తుందనే చర్చ జరుగుతోంది. దీంతో దసరా తరువాత కొత్త డీసీసీలను నియమించనున్న నేపథ్యంలో జనగామ డీసీసీ అధ్యక్ష పదవి దాదాపుగా ఝాన్సీరెడ్డికి ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం జనగామ కాంగ్రెస్‌లో డీసీసీ మార్పుపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

సివిల్ ఎస్సైగా ఎంపికవడం గర్వకారణం

● రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్



సివిల్ ఎస్సైగా ఎంపికైన యువకుడిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 23: మొట్ట మొదటిసారిగా మండలంలోని ఇప్పగూడెం గ్రామం నుంచి పల్లె వ సంత -సత్యనారాయణగౌడ్‌ల కుమారుడు పల్లె పవన్ సివిల్ ఎస్సైగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్ తెలిపారు. సివిల్ ఎస్సైగా ట్రైనింగ్ పూర్తి చేసుకొని గ్రామానికి వచ్చిన పవన్‌ను సోమవారం గ్రామ గౌడసంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయం అవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చట్ల యాదగిరి, యాకయ్య, పల్లె రవీందర్, సట్ల రాములు, పల్లె లక్ష్మీనారాయణ, రైల్వే ఉద్యోగి పల్లె నరేందర్, పొగాకు సోమయ్య, చట్ల సురేష్, శ్రీను, కుమార స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు బోట్ల శ్రీనివాస్ మృతి



బోట్ల శ్రీనివాస్

జనగామ రూరల్. సెప్టెంబరు 23 : జిల్లా కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు, మాజీ కౌన్సిలర్ బోట్ల చిన్న శ్రీనివాస్ ఆనారోగ్యంతో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రవైట్ అసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మరణించాడు. సీపీఎం నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు అంతిమ యాత్రలో పా ల్గొన్నారు. ంసీపీఎం నాయకులు శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పి ంచారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగయ్య , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బోట్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మాట్లాడి ప్రగాడ సంతాపం తెలిపారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు శ్రీనివాస్ భౌతిక కాయంకు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళల ర్పించిన వారిలో మోకు కనకరెడ్డి, పాలడుగు భాస్కర్, సీహెచ్ రాజారెడ్డి, ఊడు గుల క్రిష్టయ్య, ఎండీ అబ్బాస్, ఇర్రి అహల్య, ఎర్రమల్ల సుధాకర్, వేముళ్ల సత్యనారాయణరెడ్డి, జాయ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తరిగొప్పుల, సెప్టెంబరు 23: మండల కేంద్రాని చెందిన దగ్గెల శ్రీలత, మండల కేంద్రం శివారు జగ్గయ్యపేటకు చెందిన పుట్ట యాకమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు బైకని బాలరాజు యాదవ్ సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కత్తుల సాయిరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎమ్డీ యాకూబ్, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ కొయ్యడ రాజు, బత్తుల వెంకటేష్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

జఫర్‌గడ్, సెప్టెంబరు 23 : వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జఫర్‌గడ్ శివారు వడ్డెగూడెంలో సోమవారం గొడుగులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ కన్వీనర్ మొలుగూరి యాకయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొగుళ్ల కుమార్, లాకావత్ సురేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు టి.రాజేందర్, మండల ప్రతినిధులు మామిడాల మధుబాబు, పనికర మోహన్ పాల్గొన్నారు.